


నిరుడు విశాఖపట్నం ఏజెన్సీలో మలేరియా మరణాల గురించి తెలుగుదేశం నాయకులు అల్లరి చేసిన సంగతి, అటువంటిదేమీ లేదని కాంగ్రెస్ పాలకులు దబాయించిన సంగతీ తెలిసినదే. రెండువేల మందికి పైగా ఆదివాసులు మలేరియా కారణంగా మరణించారని తెలుగుదేశం నాయకులు ఆరోపించగా, లేదు లేదు ఏడుగురు మాత్రమే చనిపోయారని కాంగ్రెస్ ప్రభుత్వం అనింది. తెలుగుదేశం నాయకులు అక్కడితో ఆగిపోకుండా జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ ఈ ఫిర్యాదుపైన విచారణ జరిపి రిపోర్టు ఇయ్యవలసిందిగా రిటైర్డు ఐఏఎస్ అధికారి కె.ఆర్. వేణుగోపాల్ గారిని పురమాయించింది.

కె.ఆర్.వేణుగోపాల్ గారు వివరంగా పరిశీలించి జాతీయ మానవహక్కుల కమిషన్‌కు సమర్పించిన నివేదిక సారాంశాన్ని ప్రజలకు అందియ్యడం కోసం ఈ కరపత్రం ప్రచురిస్తున్నాం. తెలుగుదేశం నాయకుల ఫిర్యాదు నిజమేనని అంటూ, దానికి కారణమైన విధాన వక్రీకరణ మాత్రం చంద్రబాబు నాయుడు పాలనలో మొదలయి కాంగ్రెస్ పాలనలో కొనసాగిందని వేణుగోపాల్ గారు తెలుగుదేశం నాయకులకు మొట్టికాయ వేశారు. ఆ తరువాత చంద్రబాబు నాయుడు మలేరియా మరణాల గురించి ఎక్కడా మాట్లాడక పోవడం గమనార్హం.

# దోమ ఒక్కటే కారణం కాదు

ఏజెన్సీలో మలేరియా మరణాలపై
కె. ఆర్. వేణుగోపాల్ నివేదిక



2005 సంవత్సరం మొదటి ఏడు నెలలలో పాడేరు ఏజెన్సీలో నమోదయిన 2227 చావులకు ప్రధాన కారణం మలేరి యాయేనా? అదేనయితే ఆ ప్రాంతంలో మలేరియా అంత విస్తృతంగా ఎందుకుంది? వైద్య వ్యవస్థ దానినెందుకు ఎదుర్కోలేక పోతున్నది? పరిసరాల పారిశుధ్యాన్ని కాపాడ వలసిన ప్రభుత్వ శాఖలు ఆ పని ఎందుకు చేయలేకపోతున్నాయి? అక్కడి ప్రజలు రోగాల్ని తట్టుకోవడానికి కావలసిన శారీరక శక్తి ఎందుకు లేకుండా ఉన్నారు?

ఇవీ కె.ఆర్.వేణుగోపాల్ గారు వేసుకుని జవాబు వెతికిన ప్రశ్నలు. 1999 నుండీ విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీలో ఆదివాసుల మలేరియా మరణాలను చూస్తూనే వున్నాము కాబట్టి, ఈ సంవత్సరం కూడా అదే జరగదన్న నమ్మకమేమీ లేదు కాబట్టి, వారు ప్రకటించిన జవాబులను తెలుసుకోవడం మన వంతుగా విపత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండేందుకు ఉపయోగపడవచ్చు.

**వైద్య వ్యవస్థ:**

వైద్య సిబ్బంది కొరతను మలేరియా మరణాలకు ఒక ముఖ్య కారణంగా కె.ఆర్.వేణుగోపాల్ గారు గుర్తించారు.

'గడచిన ఆరేడు సంవత్సరాలుగా అన్నిరకాల ప్రభుత్వ ఉద్యోగుల నియామకమూ ఆంధ్రప్రదేశ్‌లో నిలిచి పోయింది. ఇది ఏజెన్సీ ప్రాంతంలోని వైద్య సిబ్బందికి కూడా వర్తిస్తుంది' అని వేణుగోపాల్‌గారు అన్నారు. ఇది చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా జరిగిందని మనకు తెలుసు.

పాడేరు ఏజెన్సీలోని వివిధ ప్రభుత్వ వైద్యశాలలలో మొత్తం 818 పోస్టులు ఉండగా, 2001-2002లో అందులో 99 ఖాళీగా ఉన్నాయి. 2002-2003లో 106 ఖాళీగా ఉన్నాయి. 2003-2004లో 147 ఖాళీగా ఉన్నాయి. 2004-2005లో 186 ఖాళీగా ఉన్నాయి. ఈ నాలుగు సంవత్సరాలూ ఖాళీగా ఉన్న పోస్టులలో అత్యున్నత స్థాయిలోని అయిదు పోస్టులనూ ప్రత్యేకంగా పేర్కొనాలి. సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ (స్పెషలిస్టు), ముగ్గురు డిప్యూటీ సివిల్ సర్జన్‌ల పోస్టులు 2001 నుండి ఖాళీగానే ఉన్నాయి.

'వైద్యరంగంలో పోస్టులు భర్తీచేసే విషయంలో ప్రభుత్వ వైఖరి ఈ విధంగా ఉండగా ఆదివాసుల ఆరోగ్యం బాగుండడం కల్ల' అని వేణుగోపాల్ గారన్నారు.

ఏజెన్సీలోని వైద్య వ్యవస్థ కాల్బలం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు. వీరిని ప్రవేశపెట్టింది కూడ ప్రపంచ బ్యాంకు సలహామేరకే. పాడేరు ఏజెన్సీలో గ్రామగ్రామాన ఉన్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఖ్య 3200. వీళ్లు అదే ఏజెన్సీకి చెందిన ఆదివాసీ మహిళలు. ఆదివాసులందరిలాగ వీళ్లు కూడా వారంలో రెండు రోజులు పస్తులుం టారు. కూలి చేసుకొని సంసారాలు పోషించుకుంటూ తమకే తెలియని వైద్యం చేస్తుంటారు. దీనికి వారికిచ్చే పారితోషికం నెలకు 400 రూపాయలు. అదికూడా ప్రతీనెలా ఇవ్వడంలేదు. ఆరు నెలలకొకసారి ఇస్తారు. 'కూలి చేసుకొని అర్ధాకలితో బతుకీడుస్తూ ఆరునెలలకొకసారి పారితోషికం పొందే ఈ ఆదివాసీ మహిళలు తమ తోటి ఆదివాసులలో ఆరోగ్య స్ఫూర్తిని ప్రచారం చేస్తారనీ, మలేరియా వ్యాధిపైన పోరాటం చేస్తారనీ ఎట్లా ఆశిస్తాం?' అని వేణుగోపాల్‌గారు ప్రశ్నించారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నియామకాన్ని వేణుగోపాల్ నిరర్థకమనలేదు. అయితే వారికి కనీస ఆర్థిక భద్రత కల్పించి తగుమాత్రం శిక్షణ ఇయ్యవలసి ఉండిందనీ, అదేమీ లేకుండ పారాసెటమాల్ బిళ్లలూ, క్లోరోక్విన్ బిళ్లలూ ఇచ్చి జనం మీద వదిలేస్తే వచ్చే ప్రయోజనమేమీ లేదనీ అన్నారు.

## పేదరికం:

ఒంట్లో సత్తువ ఉంటే ఏ మందులూ లేకున్నా రోగాన్ని కొంతమేరకు తట్టుకోగలం. ఆ శక్తి ఉండాలంటే తిండి ఉండాలి. తిండి ఉండాలంటే పని దొరకాలి, తగుమాత్రం వేతనం దొరకాలి.

ప్రభుత్వ గణాంకాల ప్రకారమే పాడేరు ఏజెన్సీలోని 1,26,013 కుటుంబాలలో 1,17,834 దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయి. ఆ రేఖకు ఎగువన ఉన్న కొద్దిమందీ గిరిజనేతరులే అయి వుంటారు కాబట్టి, ఆదివాసీ జనాభా మొత్తంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉందని భావించవచ్చు. అందులో 57,975 కుటుంబాలను 'పేదలలోకే పేదలు'గా ప్రభుత్వమే గుర్తించింది.

ఆదివాసీ కుటుంబాలన్నీ కూడా వారంలో మూడు లేక నాలుగు రోజులు ఒక పూట మాత్రమే తింటున్నట్టు తాను పర్యటించిన గ్రామాలలో తెలుసుకున్నానని వేణుగోపాల్‌గారు అన్నారు.

గ్రామాలలో కూలిపనికి ఇచ్చే వేతనం రోజుకు 20 రూపాయలు మాత్రమే (స్త్రీకయినా, పురుషునికయినా). డివిజన్ కేంద్రమయిన పాడేరులో ఏదైనా పని దొరికినప్పుడు అంతకంటె ఎక్కువ వేతనమే ఇస్తారు గానీ పాడేరులో పని దొరికేది తక్కువ, దానికి పోటీ ఎక్కువ. మొత్తంమీద ఆదివాసులకు సంవత్సరంలో నాలుగు నెలలు మాత్రమే పని తగినంత దొరుకుతుందనీ, తక్కిన ఎనిమిది నెలలు అర్ధాకలితో బతకవలసిందేననీ వేణుగోపాల్‌గారు నిర్ధారించారు. పోషకాహార లోపం అత్యధికంగా ఉండేది మే, జూన్, జూలై నెలలలోననీ, మలేరియా జ్వరం ఉధృతంగా వ్యాపించేదీ ఆ కాలంలోనేననీ అన్నారు.

ఈ కొద్దిపాటి ఆదాయంతో రేషన్ బియ్యం కొనుక్కొని ఆమేరకయినా ప్రభుత్వ సహాయం పొందగలరా అంటే అదీ లేదు. డిపోలో నెలసరి బియ్యం ఒకరోజు ఇస్తారు. కుటుంబం కోటా అయిన 20 కేజీలూ ఆరోజు కొనుక్కోవలసిందే. ఒకేసారి అంత డబ్బు చేతిలో లేక కొనుక్కోలేకపోతే ఎంత కొనుక్కుంటే అంతే ప్రాప్తి. ఆపైన ఇంటి అవసరాలకు మార్కెట్ రేటు పెట్టి బయట కొనుక్కోవాలి, లేకపోతే బియ్యం లేకుండ బతకాలి.

ఈ పరిస్థితిలో ప్రతీ ఆదివాసీ కుటుంబమూ మండల కేంద్రాలలోని షాహుకార్లకు రుణపడి ఉందంటే ఆశ్చర్య పోనవసరం లేదు. ఒక్కొక్క కుటుంబం తలమీద ఉన్న రుణభారం రూ. 10,000/- దాకా ఉండవచ్చు. దీనికి వడ్డీ చాలా సందర్భాలలో నెలకు రూ. 100/-కు అయిదు రూపాయలు - అంటే 60%.

ఇంతటి పేదరికంలో ఉన్నవారు రోగాలనెట్లా ఎదుర్కోగలరు?

## పరిసరాల పారిశుధ్యం:

మలేరియా క్రిమి మన శరీరంలోకి దోమల వల్ల ప్రవేశిస్తుంది. పాడేరు ఏజెన్సీలో సంవత్సరం పొడవునా దోమలుంటాయి. అక్కడ అడవులు దట్టమయినవి. వార్షిక వర్షపాతం 1124 మి.మీ.లు. నేల ఎగుడు దిగుడుగా ఉండడం వల్ల వర్షం నీళ్లు మడుగులలో నిలిచిపోతుంది. ప్రజలకు బహిర్భూమే మరుగుదొడ్డి కావడం వల్ల ఈ మడుగులు మలినానికి నెలవవుతాయి, దోమలకు ఆవాసాలవుతాయి. దోమలు అధికంగా ఉండే ప్రాంతాలలో మలాథియాన్ వంటి మందులు స్ప్రే చేసే బాధ్యత మలేరియా నిరోధక శాఖది. కానీ వేణుగోపాల్ గారు పర్యటించిన అన్ని గ్రామాలలోనూ వారు గమనించిందేమిటంటే, ఇళ్ల బయట, పశువుల కొట్టాలలో స్ప్రేయింగ్ జరుగుతున్నదిగానీ మురుగు నీటి కుంటల మీద, కాలవల మీద, ఊరి పక్కనున్న చేలలోను చేయడంలేదు. అది కూడా సంవత్సరంలో ఎప్పుడో ఒకటి రెండుసార్లు జరుగుతున్నది. చావులు మొదలయిన తరువాతే స్ప్రేయింగ్ మొదలవు తున్నది.



శుభ్రమైన తాగునీటి వసతి సహితం ఆదివాసీ గ్రామాలకు ప్రభుత్వం కల్పించలేదు. పాడేరు ఏజెన్సీలో 3,468 ఆవాసాలు ఉండగా, అందులో

## జరగాల్సిందేమిటి?

- పాడేరు ఏజెన్సీలోని ఆస్పత్రులలో అన్ని పోస్టులూ వెంటనే నింపాలి. డాక్టర్లంతా విధులలో ఉండేటట్టు చూడాలి.
- కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు నెలకు 1000 రూపాయలు ప్రతీనెలా జీతంగా ఇచ్చి మలేరియా చికిత్సలో ప్రాథమిక తర్ఫీదు ఇవ్వాలి.
- వేసవిలో ఆదివాసులకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించే పథకాలు రూపొందించి అమలు చేయాలి. కేజి బియ్యం 3.00 రూపాయలకు ఇచ్చే అంత్యోదయ పథకం ఆదివాసులందరికీ అందుబాటులోకి తేవాలి.
- మలాథియాన్ వంటి క్రిమిసంహారక మందులు విరివిగా సరఫరా చేయాలి, క్రమం తప్పకుండా స్ప్రే చేయాలి.
- అన్ని ఆదివాసీ గూడేలకూ శుభ్రమైన మంచినీటి వసతి కల్పించాలి.
- ఆదివాసీ కుటుంబాలన్నిటికీ ఉచితంగా తగినన్ని దోమతెరలు సరఫరా చేయాలి.
- ఏజెన్సీలో అసహజ మరణాల గురించి ప్రభుత్వము, ప్రభుత్వ వైద్యులు అబద్ధాలు చెప్పడం మానేయాలి.

114 ఆవాసాలలో మాత్రమే నీళ్ల ట్యాంకు, ఇంటింటికి పైపులు ఉన్నాయి. 2078 ఆవాసాలలో చేతిబోర్లు మాత్రమే ఉన్నాయి. వర్షాకాలంలో బోరు దగ్గర నీళ్లు నిలిచినట్టయితే బోరు నుండి తోడుకునే నీరు కలుషితమై ఉండే అవకాశం ఉంది. 1083 ఆవాసాలకు ఏ నీటివసతీ లేదు - అంటే సమీపంలోని ఏ వాగునుండో తెచ్చుకుంటారు. అటు వంటి నీటివనరుల శుభ్రత గురించి చెప్పనవసరం లేదు.

దోమల బారి నుండి ప్రజలను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తానని హామీ యిచ్చిన దోమతెరలు మూడవ వంతు కుటుంబాలకు కూడా అందలేదు. కేంద్ర ప్రభుత్వం నుండి సహాయంగా రావలసిన 'స్ప్రే' చేసే క్రిమిసంహారక మందు కూడా సకాలంలో అందలేదు. ఆ మందు 'స్ప్రే' చేసింది తక్కువే కాగా దాన్ని మొదలు పెట్టింది కూడా చాలా ఆలస్యంగా.

### చావుకు కారణం మలేరియాయేనా?

చావులకు కారణం మలేరియా కాదనీ, ఎండ దెబ్బ నుండి గుండెపోటు దాకా అనేక కారణాలున్నాయనీ ప్రపంచాన్ని నమ్మించడానికి రాష్ట్ర ప్రభుత్వమూ, స్థానిక వైద్య సిబ్బందే కాక రాష్ట్ర ప్రభుత్వం పిలిపించిన నిపుణులు కూడా చేసిన ప్రయత్నాలను వేణుగోపాల్ గారు తీవ్రంగా అభిశంసించారు. మృతులకు పోస్టుమార్టం నిర్వహించి ఎవరెందుకు చనిపోయారో నిర్ధారించే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. అయితే ఏజెన్సీలోని ఆస్పత్రులకు వచ్చిన రోగుల రక్తపరీక్షల్లో సగటు కంటె చాలా ఎక్కువ కేసులు మలేరియా జబ్బును సూచించిన మాట ప్రభుత్వ అధికారుల నివేదికలే తెలుపుతున్నాయనీ, మలేరియా అని తేలిన కేసులలో 70 శాతం కంటే ఎక్కువ ప్రాణాంతకమైన ఫాల్సిపారం మలేరియా (ఇది మెదడును దెబ్బతీసి వేగంగా చావుకు కారణం అవుతుంది) అనీ కె.ఆర్.వేణుగోపాల్ గారు అభిప్రాయపడ్డారు. 'వివరమయిన విశ్లేషణ అనంతరం, జ్వరం వల్ల చనిపోయిన వారిలో అత్యధికులు మలేరియా వల్ల, అందులో ఫాల్సిపారం మలేరియా వల్ల చనిపోయారని నేను భావిస్తున్నాను' అన్నారు.

### ముగింపు:

ఇది నిజానికి ముగింపులేని సమస్య. పేదరికం, పోషకాహార లోపం, దోమల బెడద కల్పించిన సమస్యను వైద్య పారిశుధ్య వ్యవస్థలను పనిగట్టుకొని నాశనం చేసిన బాధ్యతారహిత పాలనా విధానాలు ఎన్నోరెట్లు పెంచాయి. అన్నికోణాల నుండి పరిస్థితిని చక్కబెట్టే బృహత్తర ప్రయత్నం ఇప్పటికే మొదలుకావలసి ఉండింది కానీ కాలేదు. ప్రజలయినా ఒత్తిడి పెట్టి మొదలుపెట్టించకపోతే వేసవి ఎంతో దూరం లేదు, ఆ వెనుక వచ్చే వర్షాలూ, అవి తెచ్చే రోగాలూ ఎంతో దూరం లేవు.

విశాఖపట్నం
20 జనవరి 2006

మానవహక్కుల వేదిక
Human Rights Forum (HRF)